క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సర్పంచ్

కుప్పం: మండలంలోని పైపాళ్యం గ్రామ పంచాయతీ చిన్నబొగ్గుపల్లిలో కొత్తగా నిర్మించిన శ్రీ ప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పుష్పావిశ్వనాథ్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయంలో నీటి వసతి కల్పించేందుకు పైపాళ్యం సర్పంచ్ విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆర్ముగం, వార్డు మెంబర్లు హరి, మణి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ

పుంగనూరు: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న సుబ్రమణ్యం ద్విచక్రవాహనంపై శనివారం బయలుదేరాడు. అదేసమయంలో గూడూరుపల్లి జెడ్పీ హైస్కూల్ టీచర్ మునిరాజా మరో ద్విచక్రవాహనంలో తూర్పుమొగసాల పెట్రోల్ బంకులో నుంచి రోడ్డుపైకి రావడంతో సుబ్రమణ్యం వాహనాన్ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ఇద్దరిని వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సుబ్రమణ్యంను తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్‌లాక్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీమోహన్

బైరెడ్డిపల్లె: బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్మార్ట్‌లాక్ వేసుకొని వెళ్లడం వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని సీఐ మురళీమోహన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం స్మార్ట్‌లాక్ ఉపయోగాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ప్రజలు స్మార్ట్‌లాక్‌లను సద్వినియోగం చేసుకొని చోరీల నియంత్రణకు కృషిచేయాలన్నారు. ఎస్ఐ పరుశురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఐ ఇన్‌చార్జ్‌గా నూరేషా

రొంపిచెర్ల: ప్రజాసంకల్ప వేదిక పుంగనూరు నియోజకవర్గ ఆర్టీఐ ఇన్‌చార్జ్‌గా రొంపిచెర్లకు చెందిన నూరేషాను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రంగసాయిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా నూరేషా మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షుడు రంగసాయిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రారంభోత్సవం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపంజాణి: మండలంలోని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రంలో చిన్నపిల్లల సంరక్షణ కోసం వినియోగించే నియోనేటల్ రేడియంట్ వార్మర్ విత్ ఫొటో థెరపీ యంత్రాన్ని శనివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. యంత్రం పనితీరును డా.మురళి ఎమ్మెల్యేకు వివరించారు. దాత సునీల్‌రెడ్డిని ఆయన అభినందించారు. అనంతరం రాయలపేట రోడ్డు నుంచి బాలేపల్లి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. రాయలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఎంపీపీ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ అరుణ, ఎంఈఓలు గోపాల్‌రెడ్డి, తులసీరాం, హెచ్‌ఎం రత్నమ్మ, ఎంపీడీఓ బాలాజీ, నేతలు మురహరిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

గుడుపల్లె: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేసుకోవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం స్థానిక శ్రీశక్తి భవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుప్పం ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అందరూ కలసికట్టుగా ఉంటేనే సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వ భూములు, వంకలు, వాగుల్లో కూడా లేఔట్‌లు వేసి సొమ్ము చేసుకుంటున్నారని గుండ్లసాగరం సర్పంచ్ నాగరాజు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాక్రిష్ణ, తహసీల్దార్ సీతారాం, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, ఎస్ఐ శ్రీనివాసులు, టీఎం బాబునాయుడు పాల్గొన్నారు.

తవ్వేసి.. కూల్చేసి!

- యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- కౌండిన్యలోని చెక్‌డ్యామ్ ధ్వంసం
- రెండు గ్రామాల రైతుల కడుపుకొట్టిన ఇసుకాసురులు
- స్పందించని అధికారులు



చెక్‌డ్యామ్‌లో కానరాని చుక్కనీరు



వృక్షాల మొదళ్లను సైతం పెకిలించి ఇసుక తోడేస్తున్న దృశ్యం

పలమనేరు: ఆ గ్రామం కౌండిన్య నదికి ఆనుకుని ఉంది. ఇక్కడ యాభైమంది దాకా రైతుల భూములున్నాయి. నదిలో నీరుంటే ఏటా మూడు పంటలు పండే భూములవి. నదిలో నీరు నిల్వ ఉండేలా గతంలో చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో నది ప్రవహించినప్పుడు ఇక్కడ నీరు నిల్వ ఉండేది. ఫలితంగా రైతులు పంటలను సాగుచేసుకొనేవారు. నదిలోని చెక్‌డ్యాంలో నీరు నిల్వ ఉంటే ఇసుక తోడేందుకు వీలుకాదని జీడుమాకులపల్లికి చెందిన ఇసుకాసురులు భావించారు. దీంతో ఎలాగూ సీఎం చెప్పినట్టు ఇసుక ఫ్రీ కాబట్టి పక్కా ప్లాన్ వేశారు. కౌండిన్య నదిలోని చెక్‌డ్యాంను ధ్వంసం చేస్తే అక్కడున్న నీరు మొత్తం పోయి ఇసుక తవ్వకాలకు బాగుంటుందని భావించారు. ఇదే తడవుగా కొందరు కూలీలను పెట్టి చెక్‌డ్యాంను తవ్వించే పనులు చేశారు. కానీ వీలు కాలేదు, దీంతో ఇసుకాసురులంతా కలసి రూ.50వేలు ఖర్చు పెట్టి రాత్రికి రాత్రే జేసీబీలతో చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేసేశారు. దీంతో అక్కడ నిల్వ ఉన్న నీరు కిందికిపోవడంతో ఇప్పుడు యథేచ్ఛగా అక్కడ ఇసుకను తవ్వుకుంటున్నారు. ఇంతటి ఘోరమైన సంఘటన గంగవరం మండలం క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిపై ఇటీవల వెలుగుచూసింది. ఇసుక అమ్మకాలకు అలవాటు పడిన జీడుమాకులపల్లి ఇసుకాసురులు ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. ఫలితంగా నదికి ఆనుకుని పంటలు సాగుచేసే కొంగోళ్లపల్లి రైతుల కడుపుకొట్టారు. దీంతో రైతులు పంట సాగుచేయలేక అవస్థలు పడుతున్నారు.

గతంలోనే గండి కొట్టారు

గతంలో కౌండిన్య నదిలోని క్యాటిల్‌ఫామ్ చెక్‌డ్యాంలో నది ప్రవహించినప్పుడు భారీగా నీరు నిల్వ ఉండేది. ఇసుకాసురులు తెలివిగా ఆ చెక్‌డ్యాంకు గండి కొట్టారు. ఆపై తమకేమీ తెలియనట్టు నటించారు. నదీ ప్రవాహానికి గండి పడిందనే అనుమానంతో ఇరిగేషన్ అధికారులు ఆ చెక్‌డ్యాంకు మరమ్మతులు చేశారు. దీంతో గతంలో పడిన వర్షాలకు కౌండిన్యలో ప్రవాహం వచ్చి నీరు నిల్వ ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ జేసీబీలతో ఈ చెక్‌డ్యాంను ధ్వంసం చేసేశారు.

చెట్లు, బ్రిడ్జి సైతం నాశనం...

ఈ చెక్‌డ్యాంకు ఆనుకుని పలమనేరు మున్సిపాలిటీ నీటిని సరఫరా చేసే పంపు హౌస్ ఉంది. దీన్ని కూడా ఇసుకాసురులు ధ్వంసం చేసేశారు. కానీ మున్సిపల్ అధికారులు దీనిపై ఏమాత్రం స్పందించలేదు. నదికి ఆనుకొని అటవీశాఖకు చెందిన నగరవనం ఉంది. ఇందులో భారీ చెట్లున్నాయి. ఇసుకాసురులు ఈ చెట్ల వేర్లు తేలిపోయేలా ఇసుకను తోడేశారు. ఇంత జరుగుతున్నా ఫారెస్ట్ శాఖ సైతం నోరుమెదపలేదు. ఇక కౌండిన్య నదిలోని చెక్‌డ్యాంను ధ్వంసం చేసినా ఇరిగేషన్ అధికారులు ఇసుకాసురులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పక్కనే చెన్నై– బెంగళూరు హైవేపై ఉన్న బ్రిడ్జి సైతం ఇసుకాసురుల దెబ్బకు కూలేందుకు సిద్ధంగా మారింది. హైవే అధికారులు కూడా దీనిపై మాట్లాడడం లేదు.

అధికారులకు విన్నవించినా లాభం లేదు..

కొంగోళ్లపల్లికి చెందిన పలువురు రైతులు ఇసుకాసురులు చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేశారని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సైతం ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు. దీంతో రైతులు చందాలేసుకొని చెక్‌డ్యామ్ మరమ్మతులు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఏదేమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణా ఓ ఫ్యాషన్‌లా మారింది. కేవలం క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిలో ఇసుకు తోడేవాళ్లు 50మంది దాకా ఉన్నారంటే ఇసుక దందా ఎలాసాగుతుంతో అర్థం చేసుకోవచ్చు. అప్పులు చేసి మరీ ట్రాక్టర్లు, జేసీబీ వాహనాలను కొని వందలాది ట్రాక్టర్ల ఇసుకను దోచుకుంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ అయినా చర్యలు తీసుకోవాలని కొంగోళ్లపల్లి రైతులు కోరుతున్నారు.



క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిపై కనిపించని చెక్‌డ్యాం



నదిలో నిర్మించిన రోడ్డు

బాల్యవివాహాలతో సమస్యలు



శిక్షణ ఇస్తున్న అధికారులు

వి.కోట: బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలతో భవిష్యత్‌లో మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వాటిని నియంత్రించడం మన అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మాధవిలత, లీగల్ అడ్వైజర్ రేఖ, పీఎం లావణ్య, సీసీలు రామకృష్ణ, కాంతారావు, శాంతమ్మ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో బోరు



ఇటుకనెల్లూరులో వేస్తున్న బోరు

పుంగనూరు: మండలంలోని ఇటుకనెల్లూరు ఎస్సీ కాలనీలో మంచి నీటి సమస్య ఉండడంతో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి నిధులతో శనివారం బోరు వేశారు. సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి కలసి నీటి సమస్యను ఎంపీకి వివరించారు. వెంటనే ఎంపీ స్పందిస్తూ రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో బోరు వేయడంతో సమస్య పరిష్కారం కావడంతో ఆప్రాంత వాసులు ఎంపీ, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దిరెడ్డిని కలిసిన నేతలు



ఏతూరులో పెద్దిరెడ్డిని కలిసిన నేతలు

పుంగనూరు: మండలంలోని మర్రిమాకులపల్లెలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పర్యటించారు. ఈసందర్భంగా పెద్దిరెడ్డిని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు కలసి తమ సమస్యలను తెలిపారు. గ్రామంలోని మోహన్‌రెడ్డి గృహప్రవేశం, వివాహ కార్యక్రమాల్లో పెద్దిరెడ్డి పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, మండల పార్టీ అధ్యక్షుడు చెంగారెడ్డి , సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రాజేష్, ఈశ్వర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివరెడ్డి ఉన్నారు.

నేడు రుద్ర హోమం

సదుం: మండలంలోని భాస్కర్‌రెడ్డి కాలనీలోని కన్యమూల వినాయకస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8 గంటలకు కలశస్థాపన, 9కి గణపతి హోమం, 11గంటలకు రుద్రహోమం, 1 గంటకు మహామంగళ హారతి నిర్వహిస్తామన్నారు. సాయంత్రం కోలాటాలు, చెక్క భజనలు సాంస్కృతిక కార్యకలాపాలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.

నామ ఫలకం వితరణ



నామఫలకం ముందు దాత, టీచర్లు, విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండు దశాబ్దాలుగా నామ ఫలకం లేకపోవడంతో ఉపాధ్యాయుల విన్నపం మేరకు పట్టణానికి చెందిన సమాజసేవకులు సీతారామయ్య రూ.10వేలు విలువజేసే నామఫలకాన్ని శనివారం ఏర్పాటు చేయించారు. ఎంఈఓ బాలసుందరం, హెచ్‌ఎం జయంతి, ఉపాధ్యాయ బృందం దాతకు అభినందనలు తెలిపారు.

తోటకనుమలో రెవెన్యూ సదస్సు



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

వి.కోట: మండలంలోని తోటకనుమ గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తహసీల్దార్ పార్వతికి వినతుల ద్వారా భూ సమస్యలు తెలిపారు.

72 లీటర్ల సారా స్వాధీనం



పుంగనూరులో సీజ్ చేసిన బైక్

పుంగనూరు: ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో 72 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 1000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ సురేష్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సీఐ జవహర్‌బాబుతో కలసి పత్రపల్లెతాండ చెరువులో దాడులు జరిపామన్నారు. అక్కడ మునికుమారి అనే మహిళ వద్ద 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే పెద్దపంజాణి మండలం పొట్టగానిపల్లె వద్ద ద్విచక్రవాహనంలో తీసుకెళ్తున్న 12 లీటర్ల సారాను పట్టుకున్నామన్నారు. విక్రయదారు పరారయ్యాడని సీఐ తెలిపారు. నల్లగుట్లపల్లెతాండ వద్ద 1000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. దాడుల్లో ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బంది నాగరాజు, సురేంద్రబాబు, నరేంద్రరెడ్డి, కిషోర్‌కుమార్, దశరథ, చక్రినాయక్, అల్తమస్, వెంకటాచలపతి పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రామకుప్పం: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో శనివారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేదికపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం నేడు

బైరెడ్డిపల్లె: శ్రీ శేషాద్రి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు ఎస్సీ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ మానిటరింగ్ సభ్యులు తెలిపారు. ఎస్సీలపై జరుగుతున్న దాడులు, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతిఒక్కరూ హాజరుకావాలని కోరారు.

తల్లిదండ్రుల సహకారం విలువైనది



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్



సమావేశంలో ఎంపీపీ



పలమనేరు బాలికోన్నత పాఠశాలలో..

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహం విలువైనదని వారి సహకారంతోనే పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అదేవిధంగా పసలమంద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ యువరాజ్ హాజరై మాట్లాడారు. పది పరీక్ష ఫలితాల్లో మండలంలో మొదటి స్థానం సాధించిన వారికి తన వంతుగా రూ.25వేలు ప్రోత్సాహక నగదు అందిస్తానని తెలిపారు. తోటకనుమ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ పార్వతి పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లి: మండలంలోని 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించినట్లు ఎంఈఓ తిరుమలమ్మ తెలిపారు. చౌడేపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. టీచర్లు జగన్‌మోహన్‌రెడ్డి, శంకరయ్య, రమేష్, పీఎంసీ కమిటీ చైర్మన్ వెన్నెల పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: స్థానిక లీనార్డ్ హైస్కూల్‌లో ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి పాల్గొన్నారు. అడవినాథునికుంట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ రమణంగా నిర్వహించారు. గూడూరుపల్లె హైస్కూల్‌లో హెచ్‌ఎం మహేష్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ దామోదర ఎస్ఐ షేక్ షావలి, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ కరీముల్లా పాల్గొన్నారు.

రొంపిచెర్ల: స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. జీసీడీఓ ఇంద్రాణి, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, కేజీబీవీ ఎస్‌ఓ సుజాత, టీచర్లు హేమవతి, శ్వేత, ప్రసన్న, మునీంద్రాణి, దీపిక, హేమలత, నాగముని, రాజేశ్వరి, జ్యోతి, లలితమ్మ పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, సర్పంచ్ చంద్రమ్మ, తహసీల్దార్ శివకుమార్, సీఐ ప్రసాద్, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. కల్లుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను ఉపాధ్యాయుడు తులసీనాథంనాయుడు అందజేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

గుడుపల్లె: మండలంలోని అన్ని పాఠశాలలల్లో వేడుకగా నిర్వహించారు. స్థానిక గుడుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలతో ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.



పలమనేరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ భవాని



గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో..



చౌడేపల్లెలో..



పుంగనూరు లీనార్డ్ హైస్కూల్‌లో..



సదుంలో..



బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులు



గుడుపల్లెలో..



బైరెడ్డిపల్లెలో..



టి.వడ్డూరులో ..



రొంపిచెర్ల కేజీబీవీలో మాట్లాడుతున్న ఇంద్రాణి